క్లుప్తంగా

సాగునీటి సంఘం ఎన్నికలపై శిక్షణ



ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ మురళికుమార్

నింద్ర: ఈ నెల 23న జరిగే సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. చిత్తూరు జిల్లా ఇరిగేషన్ ఈఈ మురళికుమార్ ఆధర్యంలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మండలంలో 16 సాగునీటి సంఘాలు ఉన్నాయని తెలిపారు. వీటికి జరిగే ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బంది ప్రభుత్వ నియమనిబంధనలను పాటించాలని ఆదేశించారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, ఎంఈఓలు వసుమతి దేవి, శ్రీధర్‌రాజు, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు

విజయపురం: మండలంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని జిల్లా ఇరిగేషన్ శాఖ ఈఈ మురళికుమార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారి, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ మండలంలో సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, సభ్యుల ఎన్నికలు పక్కాగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ ప్రశాంత్, ఎంపీడీఓ, ఓఈఓ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జోరు



గంజాయి తాగడానికి ఉపయోగించిన బాటిల్

పాలసముద్రం: మండలంలో గంజాయి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. దీంతో చిన్న చిన్న పిల్లలు కూడా గంజాయికి అలవాటు పడే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కూడా పట్టించుకోకపోవడంతో గంజాయి పెచ్చుమీరుతోంది. గంజాయి మత్తులో చేసే నేరాలు కూడా ఎక్కువవుతున్నాయి. క్రిష్ణమ్మపురంలోని వంకలో యువకులు గంజాయి తాగుతున్నారు. అక్కడ నుంచి మండల పరిధిలో అన్ని గ్రామాలకు గంజాయి సరఫరా చేస్తున్నారు. గంజాయి తాగి చాలా గ్రామాల్లో గొడవలు జరుగుతున్నాయి. సాయంత్రం పాఠశాల వదిలిన తరువాత బాలికలు ఇంటికి వచ్చి చేరేంత వరకు విద్యార్థినుల తల్లిదండ్రులు భయం గుప్పెట్లో ఉంటున్నారు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం మండలంలో గంజాయి అమ్మకాలను అరికట్టాల్సి ఉంది.

జోరుగా పారిశుధ్య పనులు



తయ్యూరులో పారిశుధ్య పనులు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ వరదమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల ముళ్లచెట్లు, పొదలను జేసీబీ సాయంతో శుభ్రం చేశారు. గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. నాయకులు మణి, మాజీ సర్పంచ్ సుబ్బనాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న సీడీపీఓ పద్మసునంద

కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోనివారికి డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద, సూపర్‌వైజర్లు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ వృద్ధులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి నిత్యం ఆరోగ్యంగా ఉండాలన్నారు. షుగరు, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిరా, శామిని, రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక పౌర్ణమి వేడుకలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలతోపాటు అఖండ దీపారాధన చేస్తున్నట్లు తెలిపారు. చవటగుంట ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జీవనం.. దుర్భరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను గాలికి వదిలేసింది. దీంతో వలంటీర్లు దినసరి కూలీలుగా మారుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.50 వేలు జీతం సంపాదించుకునేలా మారుస్తామని చెప్పిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ ఏమీ పట్టనట్టు ఉన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా.. ఇప్పటి వరకు వలంటీర్ వ్యవస్థకు సంబంధించి సీఎం కాదు కదా ఏ మంత్రిత్వ శాఖ కూడా స్పందించడం లేదు. దీంతో ఇక వలంటీర్ల వ్యవస్థ లేనట్టేనని అంటున్నారు.

– విజయపురం

- దినసరి కూలీలుగా మారుతున్న వలంటీర్లు
- ఇక వలంటీర్ వ్యవస్థ లేనట్టేనా?
- నెలకు రూ.10 వేలు హామీ గాలికే...

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు స్థాయిలో ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ఆయా సచివాలయాల్లో వివిధ విభాగాలలో పని చేసేందుకు ప్రభుత్వం సిబ్బందిని కూడా నియమించారు. ప్రభుత్వ ఉద్యోగాలు తోడుగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేసేందుకు 2019 ఆగస్టు 15న వారిని విధుల్లోకి తీసుకున్నారు. ప్రధానంగా లబ్ధిదారులు ఇంటికి వెళ్లి ప్రతినెలా సామాజిక పింఛను అందించడం, బియ్యం పంపిణీ సహా వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో వారు కీలకంగా వ్యవహరించారు. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు వలంటర్ వ్యవస్థను ఇలాగే కొనసాగిస్తామని, వారికి వేతనాన్ని కూడా పెంచి రూ.10 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఐదునెలలైనా ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



కల్యాణ మండపంలో వంట పని చేస్తున్న వలంటీర్

సచివాలయ సిబ్బందితో పింఛన్ పంపిణీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రతి నెలా 1వ తేదీ వలంటీర్లతో అవసరం లేకుండా సచివాలయ సిబ్బందితో పింఛన్‌ను పంపిణీ చేయడంతో వలంటీర్లలో ఆందోళన పెరిగింది. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటన్న డైలమాలో వారు పడిపోయారు. ఎవరిని అడగాలో.. ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారు. చంద్రబాబు, పవన్ మాటలు నమ్మి తాము నష్టపోయామని లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీరు చూస్తుంటే ఏదో ఒక కుంటి సాకులు చెప్పి తమను తొలగిస్తుందని వలంటీర్లు భయపడుతున్నారు.

ఇవీ బాబు మాటలు

‘టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి ప్రభుత్వం వస్తే అధికారంలోకి వస్తే స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వలంటీర్ల జీవితాలను మారుస్తాం. ఇప్పటిలా నెలకు రూ.5 వేలు రూ.8 వేలు కాకుండా ప్రతినెలా వాళ్లు రూ.30 నుంచి రూ.50 వేలు సంపాదించుకునేలా చేస్తాం. వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తాం ... ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదు. వలంటీర్లకు ఎటువంటి అన్యాయం జరగనివ్వం’ అని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకు వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు నోరు విప్పకపోవడం చూస్తుంటే వలంటీర్లను మోసం చేశాడని తెలుస్తోంది.



కరోనా కాలంలో చెన్నై వెళ్లి వృద్ధురాలికు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

దినసరి కూలీలుగా...

2024 సార్వత్రిక ఎన్నికలలో గెలిచి, అధికారం చేపట్టి ఐదు నెలలు అవుతున్నా.. వలంటీర్ వ్యవస్థపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వలంటీర్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరి నియోజవర్గంలో 560 మందికిపైగా వలంటీర్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లకు ఒకరికి రూ.5 వేల చొప్పున వేతనాన్ని అందజేసేవారు. రూ.5 వేలు చొప్పున వలంటీర్లందరికీ కలిపి నెలకు రూ.28 లక్షలు చెల్లించేవారు. గ్రామాలలో రూ.5 వేలతో కుటుంబమంతా కలిసి జీవనం సాగించేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వారు దినసరి కూలీలుగా మారుతున్నారు. కుటుంబ పోషణ కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి



వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. గత ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలనలో భాగంగా వలంటర్ వ్యవస్థను తీసుకురావడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య కొంతమేర తీరింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా వలంటీర్లకు రూ.పది వేల వేతనాన్ని అందిస్తూ వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

– భాస్కర్‌రెడ్డి, కళియంబాకం, విజయపురం

వైభవంగా పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు

నగరి: పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆచార్యరుత్విక్‌వరణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, యాగశాల వేదిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ ప్రతి రోజూ ఆలయంలో జరిగే పూజలు, అర్చనలు, ప్రత్యేక ఆరాధన సమయంలో భక్తుల నుండి గానీ, ఆలయ సిబ్బంది ద్వారా గానీ కొన్ని పొరపాట్లు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. దాని వల్ల ఆలయ పవిత్రతకు ఏదైనా లోపం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అందుకే ప్రతి ఏటా ఇలాంటి దోషాలన్నీ తొలగిపోవాలని.. ఆగమ శాస్త్రంలోని నియమాలను అనుసరించి పవిత్రోత్సవాలను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి సాగులో సస్యరక్షణ ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

కార్వేటినగరం: మామిడి సాగులో అధిక దిగుబడులు సస్యరక్షణతోనే సాధ్యమని జిల్లా ఉద్యాన శాఖ అధికారి డాక్టర్ డి.మధుసూదనరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సుద్దగుంట సమీపంలో ఉన్న శివాలయంలో మామిడి రైతులకు పూత నుంచి కోత దశ వరకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ తేనెమంచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బూడిద తెగులు, పండు ఈగ నివారణపై అవగాహన కల్పించారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే దఫాలుగా కోస్తే నాణ్యతతో పాటు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సాహిస్తున్నామని అన్నారు. దేశవాళీ, దిగుమతి రకాలకు రూ.20 వేల నుంచి రూ.29 వేల వరకు హెక్టార్‌కి రాయితీ ఇస్తామని తులిపారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటగా కోకో పంటను సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందిస్తారని, పెద్ద రైతులకు 70 శాతంతో డ్రిప్ పరికరాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరాజు, లోకనాథరెడ్డి, యువరాజు, ఉద్యానశాఖ అధికారి లోకేష్, బాలాజీ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న ఎస్ఐ సుమన్

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం విద్యార్థులకు అవసరమైన పెన్నులు, బకెట్లు, జగ్గులను ఎస్ఐ సుమన్ అందించారు. వారితో కలసి మిఠాయిలను పంచి బాలల దినోత్సవ వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తాను కూడా హాస్టల్‌లో చదివి ప్రస్తుతం ఎస్ఐగా పని చేస్తున్నానని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు కావాల్సిన మరిన్ని వనరులను సమకూర్చుతామన్నారు. హాస్టల్ వార్డెన్ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది గోవిందయ్య, జయరాం, కుక్ జయపాల్, ఉపాధ్యాయిని శోభ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో పడి పూజ

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట పంచాయతీ సద్దికూళ్లపల్లె ఆదిఆంధ్ర వాడలో బుధవారం రాత్రి అయ్యప్ప భక్తులుభక్తి ప్రపత్తులతో పడి పూజ నిర్వహించారు. పుష్ప పల్లకిపై అంబలం ఏర్పాటు చేసి వినాయకుడు, అయ్యప్ప స్వామి, సుబ్రమణ్య స్వామి చిత్ర పటాలను ఉంచి అలంకరించారు. అనంతరం గురుస్వామి ఆధ్వర్యంలో జ్యోతి పూజ, పడిపూజను వైభవంగా చేశారు. అయ్యప్ప భక్తుల భజనలతో స్వామివారిని వేడుకున్నారు. చివరిగా భక్తులకు అన్నదానం చేశారు. అయ్యప్ప శరణుఘోషతో గ్రామం మార్మోగింది.



పుష్పాలతో అలంకరించిన అంబలం

సరిహద్దుల్లో పోలీసుల దాడులు





కార్వేటినగరం: సారా తయారీ స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు, వెదురుకుప్పం: ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కార్వేటినగరం: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తమిళనాడు సరిహద్దు గ్రామాల సమీపంలోని చెరకు తోటలు, అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన గోపిశెట్టిపల్లి, కొటార్వేడు పరిసర ప్రాంతాల్లో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. కొటార్వేడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించడంతో గుర్తించిన వ్యక్తి పరారైనట్లు తెలిపారు. దీంతో సారా తయారు చేసే పరికరాలతో పాటు, 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. అలాగే అమ్మకానికి సిద్ధం చేసిన 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తయారు చేస్తూ పరారైన వ్యక్తిని పట్టుకుని త్వరలో రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో...

వెదురుకుప్పం: మండలంలోని నక్కలాంపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గురువారం నిర్వహించిన దాడుల్లో వెదురుకుప్పం పోలీసులు 1000 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు... ఎస్పీ ఆదేశాలతో నక్కలాంపల్లె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. ఎస్ఐతోపాటు పోలీసు సిబ్బంది రహస్య ప్రాంతాల్లో ఉన్న బట్టీలను గుర్తించి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన సుమారు 1000 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సరుకులు, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిషేధిత కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

చిత్తూరు కార్పొరేషన్: నిత్యం పుస్తక పఠనంతో జ్ఞానం వస్తుందని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం 57వ జాతీయ గ్రంథాలయవారోత్సవాలు పాత గ్రంథాలయ భవనం వద్ద ప్రారంభమైంది. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ మొదటి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు. చిన్నతనం గ్రంథాలయాలతో ఉన్న అనుబంధాలను ఆర్డీఓ పిల్లలకు తెలియజేశారు. డిజిటల్ మాధ్యమంలో కంటే పుస్తకల్లో ఉండే సమాచారం విశ్వసనీయమైనదన్నారు. చివరిగా వారోత్సవాల నిర్వహణ కోసం మాజీ కార్పొరేటర్ పార్థసారథినాయుడు రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శర్మ, ఉప గ్రంథాలయాధికారి లలిత, పీవీకేఎన్ ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న 108 ఉద్యోగులు

నగరి: సమస్యలు పరిష్కరించాలంటూ 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులకు సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం, అధికారులు తమ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని కోరారు. అధికారులిచ్చిన హామీ ప్రకారం స్లాబ్ ప్రాతిపదికన అందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్లను అప్‌గ్రేడ్ చెయ్యాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 సిబ్బందిని నియమించాలన్నారు. పైలట్లు, ఈఎంటీలకు ఇతర ఖాళీల్లో వారి అర్హతలను బట్టి వెయిటేజ్ ఇచ్చి నియామకం చేపట్టాలన్నారు. పైలట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజ్ ఇచ్చి నియమించాలన్నారు. 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. సహజ మరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీఓఎంఎస్ నెం.49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ.4 వేలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలన్నారు. 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ డిమాండ్లతో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు గురువారం ఓ దాత నగదు విరాళం చేశారు. చిత్తూరు నగరం తిమ్మసముద్రానికి చెందిన తులసికృష్ణ రూ.1,00,116ను ఆలయ ఈవో గురుప్రసాద్‌కు అందజేశారు. అనంతరం దాత కుటుంబసభ్యులకు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

నెహ్రూని ఆదర్శంగా తీసుకోవాలి





నగరి: ఎం.కొత్తూరు పాఠశాలలో బహుమతుల పంపిణీ, నంబాకం పాఠశాలలో బహుమతులతో విద్యార్థులు

పుత్తూరు: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ తిరుమలరాజు సూచించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏటా నవంబర్ 14న చాచా నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. ఇదే రోజు ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ మీనాకుమారి మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా 15వ తేదీన పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, 17, 18న విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలు, క్విజ్ పోటీల నిర్వహణ, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేలా తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

నగరిలో...

నగరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. నంబాకం గ్రామంలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలను సుందరంగా అలంకరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దిలీప్, షర్మిల కుటుంబ సభ్యులు విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బాక్స్‌లతో పాటు చాక్లెట్‌లు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో...

కార్వేటినగరం: నేటి బాలలే భావి భారత భాగ్యవిధాతలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అదే విధంగా ఆర్కేవీబీపేట ఉన్నత పాఠశాలలో కూడా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. శ్రీలక్ష్మీనరసింహ పాఠశాలలో కూడా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: నేటి బాలలే రేపటి పౌరులని పాలసముద్రం హైస్కూల్ హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. గురువారం జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీల్లో నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు అందించారు. హెచ్‌ఎం మీనాక్షి మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టమని, ఆయన జన్మించిన రోజును బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట(విజయపురం): వడమాలపేట గ్రంథాలయంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వడమాలపేట ఎంఈఓ తులసిరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలోని చిన్నారులకు గేమ్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడమాలపేట హెచ్‌ఎం సురేంద్ర, గ్రంథాలయ సిబ్బంది దాక్షాయణి, విద్యార్థులు పాల్గొన్నారు.



వడమాలపేటలో చాచా పుట్టిన రోజు వేడుకలు



విజయపురం : శ్రీహరిపురంలో బాలల దినోత్సవం

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు చేపట్టారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



పుత్తూరు: నెహ్రూకు నివాళులర్పిస్తున్న ఎంఈఓలు, విద్యార్థులు



కార్వేటినగరం: ఆర్కేవీబీ పేటలో బహుమతుల పంపిణీ